

ప్రజాశక్తి

ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | 5 | విజయనగరం



పార్లమెంటరీ కమిటీ సభ్యులుగా కలిశెట్టి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రెటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ శుక్రవారమే ప్రకటించారు. కమ్యూనికేషన్, ఐటి శాఖల కమిటీలో ఆయనకు స్థానం దక్కింది. ఆయా శాఖల్లో అమలవుతున్న వివిధ పథకాలు తీరు తెన్నులను సమీక్షించడంతోపాటు అవసరమైన మార్పులు చేర్పులకు సంబంధించిన ఈ కమిటీ సూచనలు చేయనుంది. ఇందుకోసం అవసరమైన సందర్భాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలనకు కూడా వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. కలిశెట్టికి కమిటీ సభ్యులుగా అవకాశం దక్కడం పట్ల ఆయన అనుయాయులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజ్ఞానం.. వినోదం



భగత్‌సింగ్, గాంధీ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

- ఆలోచింపజేసిన భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్
- ఆకట్టుకున్న కళారూపాలు
- నగరంలో వేలాది మంది విద్యార్థులతో ర్యాలీ
- భగత్‌సింగ్, గాంధీజీ బాటలో పయనిద్దాం : ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

ఉర్రూతలూగించే జానపద గీతాలు.. జనాన్ని చైతన్యం చేసే గేయాలు.. సినిమా పాటలకు అదిరిపోయే స్టెప్పులు.. అద్భుతం రక్తికట్టించేలా నాటక ప్రదర్శనలు.. విద్యార్థినుల ఆత్మరక్షణకు సంబంధించిన కరాటే విద్య.. ఇలా ఒకటా రెండా.. ఆకట్టుకునే అనేక ప్రదర్శనలు.. వీటికి సామాజిక కోణాన్ని జోడిస్తే..? ఇంకేముంది అదిరిపోతుంది కదా! అలాంటి దృశ్యాలను సాక్షాత్కరించింది భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్. విజ్ఞానం, వినోదం మేళవింపుతో నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం కన్నులపండువగా సాగింది. విద్యార్థులు, యువత, మేధావులు, నగర ప్రజలను హోరెత్తించింది.





సినిమా పాటకు హుషారైన స్టెప్పులేస్తున్న విద్యార్థులు; విజేతకు బహుమతి అందజేస్తున్న సిఐటియు నేతలు సుబ్బరామమ్మ, తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన నిర్వహించిన భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ శనివారం ఆరంభమైంది. ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన ర్యాలీ నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద ప్రారంభమై, బాలాజీ జంక్షన్ మీదుగా గురజాడ కళాభారతి ఆడిటోరియం వరకు సాగింది. ఎస్‌ఎఫ్‌ఐ జెండాలు చేబూని వాలంటీర్లు ముందు నడవగా, వారివెంట భారీసంఖ్యలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు కదంతొక్కారు. అనంతరం ఆ ఆడిటోరియం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ముందుగా భగత్‌సింగ్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతోపాటు సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ ప్రసంగించారు. ఫెస్ట్ లక్ష్యాన్ని, మూడు రోజులపాటు సాగే కార్యక్రమాలను ఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ వెల్లడించారు.

ఆకట్టుకున్న నృత్యాలు, పాటలు

భగత్‌సింగ్ ఫెస్ట్ కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పాడిన విప్లవ గేయాలు, సినీ గీతాలు శ్రోతలను అలరించాయి. జానపద కళాకారుడు జానకిరామ్ ఫెస్ట్ ప్రాధాన్యత వివరిస్తూ మాట్లాడటం, ఆయన బృందం పాడిన జానపదులకు విద్యార్థులు గొంతు కలిపి పాడి అలరించారు. విజయనగరం బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ ప్రదర్శన ఫెస్ట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫెస్ట్‌లో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా ఎన్.తేజేశ్వని మొదటి స్థానం, డి.శ్రావణి రెండో స్థానం, లాస్యవీణ మూడో స్థానం సాధించారు. విజేతలకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సుబ్బరామమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, చీకటి దివాకర్, జానపద కళాకారుడు జానకిరామ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.



నేటి యువత డ్రగ్స్‌కు బానిసవుతున్నారు. ఈ నేపథ్యంలో మత్తు పదార్థాల వల్ల వచ్చే ఆనందం కంటే విజ్ఞానం, వినోదంతో ఎంతో ఆనందం ఉంది. దీన్ని చాటిచెప్పేందుకు భగత్‌సింగ్ ఫెస్ట్ ఏర్పాటు చేశాం. నేడు అశాస్త్రీయ భావజాలాన్ని పెంచి పోషిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం. అందుకే స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా ఈ ఫెస్ట్ ఏర్పాటు చేశాం. మూడు రోజుల పాటు ఆటపాటలు, సైన్స్ ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- పి.రామ్మోహన్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు



దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో గంజాయికి ఎక్కువగా యువత బానిస అవుతున్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నా యువత వల్ల ఎటువంటి ప్రమాదం ఉంటుందనే భయంతో మహిళలు జీవిస్తున్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, డ్రగ్స్‌పై చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఫెస్ట్ సాగుతుంది.

- పావని, ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యులు



దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అన్న గురజాడ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి. యువతలో వస్తున్న, పేరుకు పోతున్న పెడధోరణులకు వ్యతిరేకంగా అవగాహన, చైతన్యం తీసుకొచ్చేందుకు ఎస్‌ఎఫ్‌ఐ చేస్తున్న కృషి అభినందనీయం.

- చీకటి దివాకర్, సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్





డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు ; జానకిరామ్ బృందం జానపద గీతాలాపన





ఎస్‌ఎఫ్‌ఐ జెండాతో వాలంటీర్ ; సభకు హాజరైన విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

దినసరి కార్మికులకు
కనీస వేతనం పెంపుదల
కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ శాఖల నియంత్రణలో, పాక్షిక ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే ఎన్‌ఎంఆర్, డైలీ వేజెస్ కార్మికులకు వేతనాలను పెంచుతూ కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నిర్ణయం తీసుకున్నారు. పెంచిన ఈ వేతనాలు ఈ ఏడాది జులై నుండి వచ్చే ఏడాది జూన్ వరకు అమలవుతాయని తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి వేతనాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీలో గత ఏడాది ధరలను పరిశీలించి, ఈ ఏడాది అంతకన్నా 10.12 శాతాన్ని పెంచుతూ కమిటీ నిర్ణయం తీసుకుంది. అన్‌స్కిల్డ్ వారికి రూరల్‌లో రూ.465, అర్బన్‌లో రూ.485గా నిర్ణయించారు. సెమిస్కిల్డ్ కార్మికులకు రూరల్‌లో రూ.560, అర్బన్‌లో రూ.590గా చేశారు. స్కిల్డ్ కార్మికులకు రూరల్‌లో రూ.680, అర్బన్‌లో రూ.700, హైలీ స్కిల్డ్ వారికి రూరల్‌లో రూ.850, అర్బన్‌లో రూ.910గా నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళికా అధికారి బాలాజీ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎన్.సుబ్రహ్మణ్యం, ఆర్‌అండ్‌బి ఇఇ ఎం.జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పెంపుడు జంతువుల నుంచి రేబీస్ వంటి వ్యాధులు సంక్రమించకుండా జంతు ప్రేమికులు, సంరక్షకులు అప్రమత్తంగా ఉండాలని, వాటికి సకాలంలో టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వై.వి.రమణ సూచించారు. ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బహుళార్థ పశు వైద్యశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్రమిత వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటంతో పాటు పెంపుడు జంతువులను కూడా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 95 పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా రేబీస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డిడి జి.మహాలక్ష్మి, ఎడి కె.వి.రమణ, రాంప్రసాద్, ధర్మారావు, చక్రవర్తి, కన్నంనాయుడు, వేణుమాధవ్, పశువైద్యులు మోహన్ పాల్గొన్నారు.



సిరిమాను చెట్టుపై గాటు వేస్తున్న ఎమ్మెల్యే అదితి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, తదితరులు



కార్యక్రమానికి హాజరైన జనం

సందడిగా సిరిమాను చెట్టు తరలింపు

ప్రజాశక్తి-డెంకాడ

పైడితల్లమ్మ సినిమాను చెట్టును శనివారం తరలించారు. మండలంలోని పెదతాడివాడ గ్రామంలో ఎం.అప్పారావు కళ్లంలో సిరిమాను చెట్టుకు పూజారి బంటుపల్లి వెంకటరావు, దేవాలయ సిబ్బంది తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం మూడుసార్లు గాట్లు పెట్టి చెట్లు కొట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు ప్రత్యేకంగా తయారు చేసిన ఎడ్ల బండిపై విజయనగరంలోని హుకుంపేటలో ఉన్న సినిమాను పూజారి ఇంటికి చేర్చారు. పైడితల్లమ్మ ఆలయ ఇఒ డివివి ప్రసాదరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది. సినిమాను చెట్టుకు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు, ఎమ్మెల్యేలు లోకం నాగ మాధవి, అదితి గజపతిరాజు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖరరావు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపిపి బి.వెంకట్ వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పతివాడ అప్పలనారాయణ, తహశీల్దార్ వి.పద్మావతి సినిమాను చెట్టుకు పూజలు నిర్వహించారు. చెట్టుకు మూడుసార్లు గొడ్డలితో గాట్లు పెట్టారు. డిఎస్‌పి శ్రీనివాసరావు బందోబస్తును పర్యవేక్షించారు. భోగాపురం సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వరద బాధితులకు విరాళాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వరద బాధితులకు రూ.4,89,481 విలువైన చెక్కులను దాతల తరపున విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు శనివారం కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు అందజేశారు. గంటా రవి రూ.20 వేలు, జమ్ము గ్రామస్తులు రూ. 62,365, పరిణీతి శ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.50 వేలు, బాలాజీ వాకర్స్ క్లబ్ రూ.25,116, న్యు హెచ్‌ఎంసి విజయనగరం మిని ట్రక్ ఓనర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.12 వేలు, డివిఎస్‌ఎ రామరాజు రూ.10 వేలు, ఎపి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రూ.2 లక్షలు, అవనాపు విజయ్, భార్గవి రూ.50 వేలు, ప్రదీప్‌నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ రూ.60 వేలు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వరద బాధితులకు ముగ్గురు దాతలు తరపున రూ.25 వేలు విలువ చేసే మూడు చెక్కులను శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు అందజేశారు. అరిగి రమేష్‌నాయుడు రూ.10 వేలు, జి.అరుణ (కరస్పాండెంట్, శ్రీవాసవి ఛారిటబుల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎస్.కోట) రూ.5 వేలు, రామకష్ణ (పరమహంస ఎడ్యుకేషనల్ సొసైటీ) రూ.10 వేలు విరాళంగా ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

హౌసింగ్ పీడీగా పి.కూర్మినాయుడు

ప్రజాశక్తి-విజయనగరంకోట

హౌసింగ్ పీడీగా పొన్నాడ కూర్మినాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ జిల్లాలో పీడీగా పని చేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. గతంలో జిల్లాలో పీడీగా కూర్మినాయుడు పనిచేశారు. కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం విధుల్లో చేరారు.

ఆర్‌డిఒగా కీర్తి

విజయనగరం ఆర్‌డిఒగా దాట్ల కీర్తి శనివారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవిన్యూ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఆమె ఇక్కడ జిల్లా బిసి సంక్షేమాధికారిగా పనిచేశారు. విఎంఆర్‌డిఎలో కార్యదర్శిగా చేస్తూ ఇటీవల బదిలీపై ఇక్కడకు వచ్చారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌డిఒ కీర్తి

నూరుశాతం ఇళ్ల నిర్మాణాలే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం ద్వారా నూరు శాతం ఇళ్ల నిర్మాణాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. ఈ మేరకు శనివారం గృహ లబ్ధిదారులతో స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు మంజూరై దాదాపు నాలుగేళ్లు పూర్తవుతోందన్నారు. ఇప్పటివరకు గుంకలాంలో 1,712 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇంకా 12,483 ఇళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. కొండకరకాం ప్రాంతంలో ఇప్పటివరకు 67 ఇళ్లు మాత్రమే నిర్మించారని, ఇంకా 2287 ఇళ్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. లబ్ధిదారులు ఫిబ్రవరి నెలాఖరికి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని చెప్పారు.

అనధికార కట్టడాలపై ఉపేక్షించేది లేదు

అనధికార కట్టడాలు, ఆక్రమణలను ఉపేక్షించబోమని కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై ఇసుక గాని, డెబ్రిస్ గాని, పిక్క గాని ఉండకుండా చూడాలన్నారు. రహదారికి అడ్డంకులు కలిగించిన వారిపై అపరాధ రుసుములు విధించాలని ఆదేశించారు. నగరంలో ఉన్న దుకాణాలను క్రమబద్ధీకరించాలని చెప్పారు. సమావేశంలో ఎసిపి అమ్మాజీరావు, టిపిఒ ఫిలిప్, టౌన్ సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.

త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం

నగరంలో ఘోషాసుపత్రిలో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య వెల్లడించారు. ఈ మేరకు ఘోషాసుపత్రిలో అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. దాదాపుగా పూర్తిగా కావచ్చిన అన్న క్యాంటీన్ త్వరలోనే ప్రారంభం కానుందని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఇ కె.శ్రీనివాసరావు, డిఇ రామ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సౌర విద్యుత్తు
జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం : ప్రతీ ఇంట్లో సౌర విద్యుత్తు వినియోగించుకొనే విధంగా వినియోగదారులను చైతన్య పరచాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కోరారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం అమలుపై తమ ఛాంబర్లో శనివారం సంబంధిత శాఖలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలాల వారీగా పథకం అమలును సమీక్షించారు. ఇప్పటివరకు 207 దరఖాస్తులు రాగా, 175 ఇళ్లకు ఏర్పాటు చేసినట్లు ఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు తెలిపారు. జెసి మాట్లాడుతూ ఈ పథకంపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించాలని ఆదేశించారు. గృహనిర్మాణ, టిడ్కో, పంచాయతీరాజ్, మున్సిపాల్టీలు సమన్వయంతో పనిచేసి పథకాన్ని అందరికీ వర్తింపజేయాలని సూచించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, డిపిఒ శ్రీధర్ రాజా, వివిధ శాఖల అధికారులు, వెండార్స్ పాల్గొన్నారు.

వ్యాయామంతోనే గుండె పరిరక్షణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

నిత్యం వ్యాయామంతో గుండెను పరిరక్షించుకోవచ్చని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ప్రపంచ గుండె పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యాన నగరంలో శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ మానసిక ఒత్తిడికి గురికావడం వల్ల గుండె సంబంధ వ్యాధులు అధికమవుతున్నాయని తెలిపారు. ఈ ర్యాలీలో డాక్టర్ తిరుమల ప్రసాద్, గైనకాలజిస్ట్ కృష్ణశాంతి, కార్డియాలజిస్ట్ ఎ.శరత్ కుమార్ పాత్రో, వైద్యులు బి.రవికుమార్, జి.వాసుబాబు, ఆర్.వి.దుర్గాప్రసాద్, ఆసుపత్రి సెంటర్ హెడ్ ఎన్.మల్లికార్జునరావు, డాక్టర్ భట్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్‌పి జిందాల్, తిరుమల ప్రసాద్, వైద్యులు, సిబ్బంది

బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్-19 స్కూల్స్ గేమ్స్ బాలికల కబడ్డీ ఎంపిక పోటీలను ఆర్‌ఐఒ ఎం.ఆదినారాయణ ప్రారంభించారు. శనివారం నగరంలో బాలికల హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఇంటర్ విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారి నుంచి జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఆర్‌ఐఒ మాట్లాడుతూ కబడ్డీ అంటే విజయనగరం జిల్లాకు మంచి పేరుందని, దానిని గుర్తించే విధంగా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు శాప్ ఎమ్‌డి రాక

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఎమ్‌డి గిరీశ ఆదివారం జిల్లాలో పర్యటించనున్నట్టు డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. విజ్జీ స్టేడియం వద్ద శాప్ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తానని చెప్పారు.

మహనీయుడు జాషువా

విజయనగరం టౌన్ : తన రచనల ద్వారా మూఢాచారాలపై తిరగబడ్డ మహనీయుడు గుర్రం జాషువా అని జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ తెలిపారు. గుర్రం జాషువా జయంతిని శనివారం నగరంలో ఓ ప్రయివేటు పాఠశాలలో నిర్వహించారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పైల రమేష్ రాజు మాట్లాడుతూ జాషువా ఎన్ని అవమానాలు పాలైన లెక్కచేయకుండా తన కళాన్ని ఆయుధంగా మార్చుకొని సామాజిక చైతన్యం కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పూడి శేఖర్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పట్టని 'మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా ఉంది రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం తీరు. 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ఊరూరా ఊదరగొట్టిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు కూడా నవ్విపోదురుగాక నాకేటి అన్నట్టు ముందుకు సాగారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తోంది. ఇప్పటి వరకు రైతులకు పూర్తిస్థాయిలో రుణాలు ఇవ్వలేదు. పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకూ రూ.20వేలు చొప్పున ఇస్తామన్న మాట నిలబెట్టుకోలేదు. గత ప్రభుత్వం రీసర్వే పేరిట చేసిన తప్పులు తడకలు అలాగే ఉన్నాయి. ఆన్‌లైన్‌లో వన్‌బిలు రాక, రిజిస్ట్రేషన్లు జరగక, ఇతర రూపాల్లో భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు విలవిల్లాడుతున్నారు. జిల్లాలో కురిసిన కండపోత వర్షాలకు జలాశయాల గేట్లు ఎత్తివేసినా వరిచేనుకు నీరు అందని పరిస్థితి కనిపిస్తోంది. వీటికి పరిష్కారం చూపాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటికీ సమస్యలు వెతుక్కుంటూ వెళ్లడం, పొలంబాట పేరిటా గొప్పలు చెప్పుకోవడం పట్ల రైతులు విస్తుపోతున్నారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రైతులు పెద్దఎత్తున ఆందోళన చేస్తుండడం ఇందుకు తార్కాణంగా చెప్పొచ్చు. పాలకొండ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ఇటీవల చేపట్టిన ర్యాలీతోపాటు ధర్నాలో పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు. ఇటు విజయనగరం జిల్లా కేంద్రంలోనూ ఎప్పటికప్పుడు రైతులు తమ సమస్యలపై నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు ప్రారంభమై మూడు నెలలైందని, పంటల సాగు మదుపులకు డబ్బుల్లేక వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం కింద రైతుల అకౌంట్లో రూ.20వేలు వేస్తామంటూ హామీ

పబ్లిక్ టాక్

ఇచ్చినప్పటికీ, నేటికీ అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ మాదిరిగా రైతులకు రూ.2 లక్షలు వరకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది విజయనగరం జిల్లాలో ఇప్పటి వరకు 16,066 మంది కౌలురైతులకు మాత్రమే గుర్తింపు కార్డులు ప్రభుత్వం అందజేసింది. వీరిలో 50 శాతం మందికి కూడా రుణాలు ఇవ్వలేదు. ఈ ఏడాది కౌలురైతులకు రూ.70కోట్లకు తగ్గకుండా రుణాలు ఇప్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ఇప్పటి వరకు కేవలం రూ.4.96 కోట్లు మాత్రమే ఇవ్వడం గమనార్హం. మరోవైపు ఎరువులు, పురుగుల మందుల ధరలు మాత్రం ఎంచక్కా పెంచేశారు. ట్రాక్టర్ అద్దెలు, ఇతర పనిముట్ల ధరలు, అద్దెలు కూడా పెరిగాయి. కౌలురైతులకు భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలుకార్డులు, ఆ కార్డులపై బ్యాంకు రుణాలు ఇచ్చే విధంగా నిబంధనలు మార్పుచేయనున్నట్టు ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. కానీ, అటువంటి నిబంధనలేవీ తమకు ఇంకా రాలేదని బ్యాంకర్లు, రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇవి చాలవన్నట్టు వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమౌతోంది. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు తగినంతగా నిధులు కేటాయించకపోవడంతో లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అండడం లేదు. ముఖ్యంగా కాలువల్లో పూడికతీత, తోటపల్లి వంటి ప్రాజెక్టు కింద పిల్లకాలువలు కూడా పూర్తి చేయలేదు. దీంతో, తోటపల్లి ఎడమ కాలువ కింద చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. మడ్డువలస జలాశయం నుంచి సాగునీరు అందక సంతకవిటి మండలంలో సుమారు 6 వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. ఇటీవల ఆయా బాధిత రైతులంతా కలెక్టరేట్‌కు వచ్చి ఆందోళన కూడా చేపట్టారు. ఇలా ఒకటా రెండా అన్నీ సమస్యలేనంటూ ప్రభుత్వం తీరుపై విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన రైతులు రగిలిపోతున్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సిరిపురపు మంజు అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మండల పరిధిలో వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. తాగునీరు, గ్రామీణ గృహ నిర్మాణం, ప్రాథమిక విద్య, ఉపాధి హామీ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, నీటిపారుదల శాఖలపై సమీక్షించారు. ఈ సమావేశంలో తహశీల్దార్, ఎంపిడిఒ జీవీ రవికుమార్, ఎంఇఒ శాంతికుమారి, హౌసింగ్ ఎఇ కనకరాజు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

వేపాడ: మండలంలోని బొద్దాం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి.జగదీశ్వరరావు శనివారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి ఐదవ తరగతి క్లాస్ రూమ్ పక్కన పిచ్చి మొక్కలు చెత్తతో ఉందని వెంటనే శుభ్రం చేయాలని హెచ్ఎంకు ఆదేశించారు. క్లాస్ రూమ్‌లో నూతన గోడచార్టను టిఎల్ఎంను తయారు చేసి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనలో 4వ తరగతికి తెలుగు చదివించడం, బోర్డు మీద వ్రాయించడం చేశారు. ఐదవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్టేసన్ పెట్టారు. ఐదో తరగతి విద్యార్థులకు 20 ఎక్కాలు రావాలన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ

నెల్లిమర్ల: రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల క్రీడాకారులు రెండు ప్రథమ స్థానాలు సాధించారు. కబడ్డీ కోచ్, రిటైర్డు పీడీ బొమ్మన రామారావు శనివారం మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో అనకాపల్లి జిల్లా సాలపువానిపాలెంలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల జట్టు ప్రథమ స్థానం సాధించి రూ.30వేల నగదు బహుమతి సాధించిందని, తిరిగి ఇదే జట్టు 25, 26 తేదీల్లో అనకాపల్లి జిల్లా మునగపాకలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రూ.20వేలు నగదు బహుమతి సాధించిందని చెప్పారు. సాలపువాని పాలెం పోటీల్లో ఉత్తమ క్రీడాకారిణిగా తాడ్డి లావణ్య ప్రోత్సాహక బహుమతి సాధించిందన్నారు. ఈ సందర్భంగా రెండు బహుమతులు సాధించిన కబడ్డీ జట్టును నెల్లిమర్ల కబడ్డీ సంఘం అధ్యక్షులు బోని సూర్య నారాయణ, నగర పంచాయతీ పెద్దలు అభినందించారు.

అభ్యాసనాభివృద్ధి మెరుగు పర్చుకోవాలి

నెల్లిమర్ల: విద్యార్థులు అభ్యాసనాభివృద్ధి మెరుగుపర్చుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్) లెక్చరర్ మాతా రామకృష్ణ సూచించారు. శనివారం ఆయన జరజాపుపేట, కొండవెలగాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలలను అభ్యసనాభివృద్ధి (లిప్)లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేసిక్ స్థాయిలో అభ్యాసన బాగుంటే ఆయా సబ్జెక్టుల్లో మంచి ఫలితాలు సాధించవచ్చున్నారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు రావాలంటే అభ్యాసన పై దృష్టి సారించాలని సూచించారు.

నేరాలు, చట్టాలపై అవగాహన

నెల్లిమర్ల: మండలంలోని కొండగుంపాంలో నేరాలు, చట్టాలపై ఎస్ఐ బి.గణేష్ శుక్రవారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలకు యువతను, విద్యార్థులను దూరంగా ఉంచడానికి సహకరించాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలి

బొబ్బిలి: పౌష్టికాహారం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఇందిరమ్మకాలనీ, ఆకులరెల్లి వీధిలో శనివారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. రెండో సెక్టార్ అంగన్వాడీలతో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట, దిబ్బగుడివలస, పిరిడి గ్రామాల్లో శనివారం పోషకార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ విజయలక్ష్మి కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులకు సహకరించాలి

రాజాం: పట్టణం పరిధిలో గల రాజం – పాలకొండ మెయిన్ రోడ్డు విస్తరణ పనులు సంబంధించి శనివారం పట్టణ మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు మెయిన్ రోడ్డుకు ఇరువైపులో ఉన్న భవనాల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణలో నష్టం కలిగే యజమానులకు ప్రభుత్వం తరపు నుంచి వచ్చే అన్ని రాయితీలను అందజేస్తామన్నారు. ఈ మెయిన్ రోడ్డు విస్తరణ పనులకు ప్రజలందరూ సహకరించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, భవన యజమానులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన కలెక్టర్

విజయనగరం : జిల్లాలో ఒక రోజు పర్యటన నిమిత్తం విజయనగరం వచ్చిన ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులను కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తర్లాడ రాజశేఖర రావు, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి జిల్లా పర్యటనకు వచ్చారు. వారితో కలెక్టర్ భేటీ అయ్యారు. జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణచక్రవర్తి కూడా పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌కు దేహశుద్ధి?

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక హెడ్ పోస్టాఫీసులో పని చేస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పోస్టాఫీసులో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించడంతో కుటుంబ సభ్యులు పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌కు దేహశుద్ధి చేశారు. పోస్టాఫీసులో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ హెడ్ పోస్టాఫీసులో విధులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అక్కడ విధులు నిర్వహించకుండా నాయుడుకాలనీలో ఒక ఇల్లును అద్దెకు తీసుకుని ఎటువంటి అనుమతులూ లేకుండా కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అక్కడే విధులు నిర్వహించి శాఖాపరమైన పనులు కోసం మహిళా ఉద్యోగులను రప్పించుకుని లైంగికంగా వేధిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వేధింపులు అధికం కావడంతో మహిళా ఉద్యోగులు కుటుంబ సభ్యులకు చెప్పడంతో శనివారం నాయుడు కాలనీలో ఏర్పాటు చేసిన కార్యాలయానికి వెళ్లి ఇన్‌స్పెక్టర్‌కు దేహశుద్ధి చేసినట్లు చర్చ జరుగుతుంది. మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు చేస్తున్న ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకొని వ్యక్తి మృతి

పూసపాటిరేగ: మండలంలోని పాత కొప్పర్లకు చెందిన లంకలపల్లి దుర్గారావు (40) శనివారం తెల్లవారుజామున మద్యం మత్తులో తన ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య శ్యామలతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు మండలంలోని సిపి ఆక్వా పరిశ్రమలో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్నాడు. గత రెండు నెలలుగా మెంటల్ డిజార్డర్‌తో ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందర పేట సిహెచ్‌సికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది కిలోల గంజాయి పట్టివేత

కొత్తవలస: సుమారు 10 కిలోల గంజాయి పట్టుకున్నట్లు సిఐ షణ్ముఖరావు తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో పెద్ద సూట్ కేస్‌లో ఆరు పెద్ద బండిల్స్ అరకు ప్రాంతం నుంచి తరలిస్తుండగా పట్టుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేరళ రాష్ట్రానికి చెందిన విను మోహన్ (32), ప్రసన్న జయన్ అరకు ప్రాంతం నుంచి పెద్ద సూట్ కేసులో గంజాయి తరలిస్తుండగా కొత్తవలసలో పోలీసులకు పట్టుబడ్డారు. స్థానిక తహశీల్దార్ నీలకంఠారావ్ సమక్షంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

శృంగవరపుకోట: అక్రమంగా రవాణా చేస్తున్న 2 కేజీల గంజాయి పట్టుబడిందని ఎస్ఐ భాస్కరరావు శనివారం తెలిపారు. మండలంలోని బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన శివకుమార్, మణికందన్ అనే ఇద్దరు వ్యక్తులు అరకు నుంచి ఎస్ కోట వైపు వస్తున్న సమయంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు పట్టుకున్నారని, వీరిని సిఐ వి రమణమూర్తి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారని ఎస్ఐ తెలిపారు.

అత్యాచార ఘటనలో యువకుడు అరెస్ట్

శృంగవరపుకోట: బాలిక అత్యాచార ఘటనలో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 24న బాధితులపై ఫోక్సో కేసు నమోదు చేశామని సిఐ వి నారాయణమూర్తి తెలిపారు. ఈ విషయమై శనివారం డిఎస్‌పి ఎం.వీర కుమార్ విచారణ చేపట్టి యువకుడుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు.

నాటు సారా బట్టీలపై పోలీసుల దాడులు

వంగర: నాటు సారా తయారీ బట్టీలపై వంగర పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని రాజులు గుమ్మడ సమీపంలో 1500 లీటర్ల నాటు సారా తయారీకు ఉపయోగించే బెల్లం ఊటలను ఎస్ఐ షేక్ శంకర్ ఆధ్వర్యంలో శనివారం ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పోలినాయుడు కళారావు పాల్గొన్నారు.

మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం వచ్చే మార్చి లోగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ కూర్మి నాయుడు అన్నారు. శనివారం జరజాపు పేటలో 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ పీడీ ఇంటి నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదార్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ ఇంతవరకు నిర్మాణ దశలో ఉన్న 80ఇళ్లు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. నిర్మాణం పూర్తి చేయకపోతే రద్దయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వర రావు, హౌసింగ్ ఇఇ శ్రీనివాస్, డిఇ మురళీ మోహన్, ఎఇ ఆర్.పవన్ పాల్గొన్నారు.

చీపురుపల్లి: ప్రభుత్వం మంజూరి చేసిన ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు అధికారులను కోరారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన 'మన ఇల్లు మన గౌరవం' అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు మంజూరై మధ్యలో


చీపురుపల్లి: మాట్లాడుతున్న ఎంపిడిఒ రామకృష్ణరాజు

నిలిచిపోయిన ఇల్లు గాని, ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఇల్లు గాని త్వరితగతిని పూర్తి చేసేందుకు లబ్ధిదారులను చైతన్యం చేయాలన్నారు. వివిధ దశలలో ఉన్న ఇల్లను 25 సెప్టెంబర్ 2025 లోపు పూర్తి చేసే విధంగా చూడాలని సూచించారు.

వేపాడ: మండలంలోని ఎన్‌కెఆర్‌పురం సచివాలయం వద్ద 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమ ప్రత్యేకాధికారి ఎఒ యశ్వంత్ కుమార్ ఆధ్వర్యంలో గృహ నిర్మాణాలకు సంబంధించిన లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు మంజూరైన గృహాల నిర్మాణం పనులు వేగవంతం చేసుకోవాలన్నారు. సమావేశంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్వేత, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని బొద్దాంలో శనివారం 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమంపై సచివాలయంలో అవగామన కల్పించారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పక్కా ఇళ్ల నిర్మానులను లబ్ధిదారులు తర్వితగతిన పూర్తిచేయాలని నోడల్ అధికారి నిర్మల కుమారి ఆదేశించారు. మధ్యలోనే ఆగిపోవడానికి గల కారణాలు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు కల్పన, ఇసుక కొరత, బిల్లులు పెండింగ్, వంటి కారణాలవల్ల ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయినట్లు లబ్ధిదారులు మొరపెట్టుకు న్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయినంతవరకు బిల్లులు చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితం సంతృప్తి నిచ్చింది

జిల్లా పరిషత్ పర్యవేక్షకులు దేవరాపల్లి అప్పన్న

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

తన ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చిందని జిల్లా పరిషత్ పర్యవేక్షకులు దేవరాపల్లి అప్పన్న అన్నారు. ఈ నెల ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఉద్యోగ జీవిత విశేషాలను ప్రజాశక్తితో ఆయన పంచుకున్నారు. మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే...

సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వర్గాలకు సంబంధించిన సాంఘిక సంక్షేమ శాఖలో, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో పనిచేసే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మనం చేసే వృత్తిలో అంకిత భావంతో పనిచేసేటప్పుడు అందరి మన్ననలు పొందుతాం. నేను పనిచేసిన ప్రతి ప్రాంతంలో అందరినీ కలుపుకుంటూ స్నేహ పూర్వకంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాను. ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న పనిని సక్రమంగా చేసుకున్నప్పుడు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుంది. నాకు అలాగే గుర్తింపు వచ్చింది.

కుటుంబ నేపథ్యం

కీర్తి శేషులు దేవరాపల్లి సన్నిబాబు, సత్యవతి దంపుతులకు నేను ఏకైక కుమారుడును. 1962లో జిన్నాం గ్రామం, గజపతినగరం మండలంలో సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించాను. నాకు ఇద్దరు సోదరిమణులు ఉన్నారు. భార్య గౌరి గృహిణి. ముగ్గురు కుమారులు. జీవితంలో మనల్ని గొప్ప స్థాయిలో నిలబెట్టేది చదువు మాత్రమే అని నమ్మడంతో పిల్లలను ఉన్నతమైన చదువులు చదివించాను. వారందరూ మంచి ఉద్యోగాల్లోనే స్థిరపడ్డారు.

విద్యాభ్యాసం : నేను జిన్నాం ప్రభుత్వ


భార్య గౌరితో అప్పన్న

పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక విద్యను అభ్యసించి, లోగిశ ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతులు పూర్తి చేశాను. జిన్నాం గ్రామంలో సెకండరీ పాఠశాల సదుపాయాలు లేక ఎనిమిదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు గజపతినగరం ప్రభుత్వ విద్య సంస్థలో చదువు పూర్తి చేశాను. ఆ తరువాత ఆంధ్రా యూనివర్సిటీలో బిఎ కోర్స్ పూర్తి చేశాను.

ఉద్యోగ జీవితం : నేను 1982 జులై ఒకటో తేదీన సాంఘీక సంక్షేమ శాఖ, విజయనగరంలో ఉద్యోగం తాత్కాలిక ప్రాతిపదికన మొదలు పెట్టాను. 1985వ సంవత్సరం మార్చి 3న శాశ్వత ఉద్యోగిగా సేవలు మొదలు పెట్టి వివిధ వృతి హోదాలలో కొనసాగి, 2000వ సంవత్సరం నవంబర్ 5వ వరకూ సేవలు అందించాను. పదోన్నతితో చీపురుపల్లి రెసిడెన్షియల్ స్కూల్లో సీనియర్ అసిస్టెంట్ వృత్తిలో నవంబర్ 6, 2000 నుంచి జులై 8, 2005 వరకూ సేవలు అందించాను. ఉద్యోగ బదిలీలో తిరిగి సాంఘిక సంక్షేమ శాఖ, విజయనగరంలో జులై 9, 2005 నుండి మే 21, 2009 వరకూ సేవలు అందించాను. మరల పదోన్నతితో జిల్లా జల యాజమాన్య సంస్థలో పర్యవేక్షకులు (సూపరింటెండెంట్) వృత్తిలో మే 26, 2009 నుంచి సెప్టెంబర్ 16, 2012 వరకూ సేవలు అందించాను. ఉద్యోగ బదిలీలో సాంఘీక సంక్షేమ శాఖ, శ్రీకాకుళంలో పర్యవేక్షక పదవిలో సెప్టెంబర్ 17, 2012 నుంచి ఫిబ్రవరి 16, 2018 వరకూ సేవలు అందించి ఫిబ్రవరి 17, 2018న జిల్లా పరిషత్, విజయనగరంనకు బదిలీ అయ్యాను. జిల్లా పరిషత్, విజయనగరంలో పర్యవేక్షకులు, పరిపాలన అధికారి పాత్రలు పోషించి సెప్టెంబర్ 30, 2024న వరకు జిల్లా పరిషత్ లో కొనసాగుతూ రిటైర్డ్ అవుతున్నాను.

ఉత్తమ అవార్డులు : పదవీకాలంలో పలుమార్లు జిల్లాస్థాయి ఉత్తమ ఉద్యోగి బహుమతి పొందాను. 2012లో విజయనగరం జిల్లా జల యాజమాన్య సంస్థ తరుపున, 2013లో శ్రీకాకుళం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ తరుపున, 2023లో జిల్లా పరిషత్, విజయనగరం తరుపున ఉత్తమ ఉద్యోగి బహుమతి పొందాను. నా ఉద్యోగ జీవితంలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉద్యోగ జీవితం విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు సహచర ఉద్యోగులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అప్పన్న చెప్పారు.

'లెండి'కి అవార్డుల పంట

డెంకాడ: జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కళాశాలకు పలు అవార్డులు లభించాయి. ఎఐసిటిఇ ఎడ్యుస్కిల్స్ వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు ఆలిండియా 2వ ర్యాంక్ సాధించడం ద్వారా లెండి ఇంజినీరింగ్ కళాశాల ఒక మైలురాయిని దాటిందని విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, అభివృద్ధికి అసమానమైన అవకాశాలను అందించడంలో సంస్థ అంకితభావానికి నిదర్శనంగా ఈ అవార్డు వచ్చిందని యాజమాన్యం తెలిపింది. కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి సుభాస్ సర్కార్, ఎఐసిటిఇ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి. సీతారాం చేతులు మీదుగా శుక్రవారం ఢిల్లీలో ఈ అవార్డును వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ కె. శివరామకృష్ణ, సెక్రటరీ డాక్టర్ వి.వి.రామారెడ్డి, ప్రిన్సిపల్, డీన్ ప్లేస్‌మెంట్స్ జి. ప్రకాష్ బాబు అందుకున్నారు.

పనులు పరిశీలన

నెల్లిమర్ల: నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ కిల్లాన అప్పలరాజు సూచించారు. శనివారం ఆయన నగర పంచాయతీ ప్రధాన రహదారిలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తీసివేయాలని, రోడ్లపై చెత్తను తొలగించాలని సూచించారు. దోమల నివారణకు ఆయా వార్డులలో స్ప్రేయింగు చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, శానిటరీ కార్యదర్శులకు ఆదేశించారు. పంపు హౌస్ లను ఎఇలు, వర్కు ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ చేసి, ప్రతి రోజు రిజర్వాయర్‌లో క్లోరినేషన్ చేసిన తరువాత మంచినీటి సరఫరా చేయాలని క్లోరిన్ టెస్టులను ప్రతిరోజు చేయాలని వార్డు ఏమినిటీస్ కార్యదర్శులకు, పంపు ఆపరేటర్స్ ఆదేశించారు.

సీతంలో ఘనంగా ఫ్రెషర్స్ డే

విజయనగరం : స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జెఎన్‌టియు జివి వైస్ ప్రిన్సిపల్ జి.జె.నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఒక కల ఉండాలని, దానిని సాధించడానికి కష్టపడే మనస్థత్వం ఉండాలని సూచించారు. సత్య విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ చదువుపై దృష్టి సారించి గొప్ప విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. కార్యక్రమ ంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు, ప్రిన్సిపల్ డాక్టర్ డి. వి.రామమూర్తి ప్రథమ సంవత్సర విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, సత్య డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయి దేవమణి, నరసింహం పాల్గొన్నారు.

'చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయాల్సిందే'

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలని దెబ్బ తీసిన చంద్రబాబు నాయుడి పాపాన్ని ప్రక్షాళన చేయాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చీపురుపల్లి వెంకటేశ్వర ఆలయంలో పాప ప్రక్షాళన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. బొబ్బిలి స్వామివారి వీధిలో ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలతో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పూజలు చేశారు. డెంకాడ మండలంలోని చింతలవలస వద్ద ఉన్న వెంకటేశ్వర దేవాలయంలో మాజీ ఎంపి బెల్లాన, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ఆధ్వర్యంలో పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఆధ్వర్యంలో పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. గజపతినగరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ప్రత్యేక పూజలు చేశారు.

కూటమి నేతల ప్రాయశ్చిత్త పూజలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో కూటమి నేతలు ప్రాయశ్చిత్తం పూజలు శనివారం నిర్వహించారు. తిరుపతి వెంకటేశ్వర స్వామికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఎపి మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మెన్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామికి రామతీర్థం దేవాలయం కళ్యాణ మండపం ప్రాంగణంలో మహా శాంతి హోమం నిర్వహించారు. జగన్ డిక్లరేషన్ ఇవ్వడానికి ఇష్టపడకే తిరుపతి


ప్రత్యేక హోమంలో పాల్గొన్న నాయకులు

టూర్‌ను రద్దు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

వ్యాయామంతో గుండె పదిలం

నేడు ప్రపంచ గుండె దినోత్సవం

ప్రజాశక్తి- బొబ్బిలి

వ్యాయామంతో గుండె పదిలంగా ఉంచుకోవచ్చును. మారుతున్న ఆహార అలవాట్లు, పని ఒత్తిడి కారణంగా చాలామంది గుండె వ్యాధులు భారిన పడుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్నవారు నుంచి పెద్దవారు వరకు హార్ట్ ఏటాక్ బారిన పడి చాలా మంది మృత్యువాత పడుతున్నారు. హార్ట్ ఏటాక్ బారిన పడకుండా గుండెను పదిలంగా ఉంచుకోవాలంటే వ్యాయామం తప్పనిసరి అని వైద్యులు అంటున్నారు.


డాక్టర్ సునీల్ కుమార్

ఎలాంటి వారికి గుండె జబ్బు వస్తుంది

రక్తంలో చక్కెర నియంత్రణ లేకుండా మధుమేహం వ్యాధితో బాధపడుతున్న వారికి, కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. మద్యపానం, ధూమపానం అలవాట్లు ఉన్నవారు, ఊబకాయం ఉన్నవారు కూడా గుండె జబ్బులు బారిన పడే అవకాశం అధికంగా ఉంది. పక్షవాతం, కోవిడ్ బారిన పడిన వారు కూడా హార్ట్ ఏటాక్ బారిన పడుతున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గుండె జబ్బు లక్షణాలు

హార్ట్ ఏటాక్ బారిన పడితే ఈ లక్షణాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఛాతి బరువు, నొప్పి వచ్చి శ్వాస ఆడక పోవడం, తల తిరగడం, చమటలు పట్టడం, గుండెదడ, ఎడమ చేతికి నొప్పి వచ్చి రెండు భుజాలు, వెనుక భాగానికి గొంతు భాగానికి పాకితే హార్ట్ ఏటాక్ వచ్చినట్లే. హార్ట్ ఏటాక్ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న గుండె వైద్యులను సంప్రదించి వైద్యం పొందితే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చునని గుండె వైద్య నిపుణులు పెంట సునీల్ కుమార్ అన్నారు.

గుండె జబ్బులు నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గుండె జబ్బులు నియంత్రణకు తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. ప్రతిరోజు తప్పనిసరిగా 30నిమిషాలు వాకింగ్ చేసి వ్యాయామం చేయాలి. మధుమేహాన్ని, బిపిను కంట్రోల్‌లో ఉంచుకోవాలి. అధిక కొవ్వు ఉన్న ఆహార పదార్థాలను, స్వీట్లను ఆహారంగా తీసుకోకుండా కార్బో హైడ్రేట్లు, హైప్రోటీన్ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి.

గుండెపోటు వచ్చిన నాలుగు గంటల్లోపు ఆసుపత్రికి వెళ్తే సేఫ్

గుండెపోటు వచ్చిన నాలుగు గంటల్లోపు ఆసుపత్రికి వెళ్లి గుండె సంబంధిత వైద్యం పొందితే ప్రాణాలను కాపాడవచ్చునని నారాయణి హార్ట్ కేర్ ఆసుపత్రి వైద్యులు పెంట సునీల్ కుమార్ అన్నారు. గుండె జబ్బు లక్షణాలు ఉన్న వారు లక్షణాలు కనిపించిన నాలుగు గంటల్లోపు ఆసుపత్రికి వస్తే ఇసిజిలో గుండె గుండెపోటును నిర్ధారించి ట్రాప్–1, ట్రాప్–టి, 2డిఎకో టెస్టు చేసి 4గంటల్లోపు త్రాంబోలైసిస్ ఇంజక్షన్ లేదా ఎకోస్ప్రిన్ 325ఎంజి, క్లోపిడాగ్రిల్ 300ఎంజి, ఆటర్వోస్టాటిన్ 80ఎంజి మాత్రలు తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటవచ్చునని చెప్పారు.

సామర్థ్యాల పరిశీలన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఇఒ బి.నరసింగరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో పదో తరగతి కీలకమని ఈ దశలోనే ఇష్టపడి చదువుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఉద్బోధించారు. హెచ్ఎం బి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. నవయుగ కవి చక్రవర్తి, కవికోకిల, కవివిశారద గుర్రం జాషువా జయంతి సందర్భంగా హైస్కూల్ ప్లస్ తెలుగు అధ్యాపకులు రహీమ్ షేక్ లాల్ మాట్లాడుతూ గుర్రం జాషువా జీవిత విశేషాలను, ఆయన రచించిన ఫిరదౌసి, గబ్బిలం, క్రీస్తు చరిత్ర, బాపూజీ, తదితర రచనల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శనివారం పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో విజేతలైన విద్యార్థులకు మండల స్థాయిలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. 'ఆడబిడ్డను కాపాడుదాం' అనే నినాదం ఆధారంగా వ్యాస రచనలో ఆడపిల్లను ఎందుకు రక్షించాలి? వక్తృత్వంలో దేశ సాధికారత కోసం బాలికలకు సాధికారత, చిత్రలేఖనంలో అంతర్జాతీయంగా బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, అనే అంశాల మీద విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనగా 'స్వర్ణ ఆంధ్ర -2047' అంశం ఆధారంగా స్వర్ణాంధ్ర సాధించడానికి రాబోయే ఐదు సంవత్సరాలలో విద్యా శాఖలో తీసుకురావలసిన సంస్కరణలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు ఏ.రాజ్ కుమార్, బి.పాపినాయుడులు మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దీనిపై మరింత అవగాహన కొరకే విద్యాశాఖ ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులను ఈనెల 29వ తేదీన జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు బి. శంకరరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిజిఆర్‌ఎఫ్ టెక్నికల్ సభ్యునిగా మసిలామణి

ప్రజాశక్తి-బొబ్బిలి

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కన్జ్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరం (సిజిఆర్‌ఎఫ్) సాంకేతిక సభ్యునిగా ఎస్.మసిలామణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సుదీర్ఘకాలంగా ఇపిడిసిఎల్‌లో ఆయన ఉన్నతాధికారిగా సేవలందించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సర్కిల్స్‌కు సూపరింటెండెంగ్ ఇంజనీర్‌గా సేవలందించి విశాఖలోని కార్పోరేట్ కార్యాలయంలో చీఫ్ జనరల్ మేనేజర్ పర్చేజెస్, ప్లానింగ్ విభాగాల్లో గత కొన్నేళ్లుగా సేవలందించారు. విద్యుత్ ఆపరేషన్స్‌లో అపారమైన అనుభవం ఉండడంతో విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించే కీలక మైన పోస్టులో తాజాగా ఆయన్ను నియమించారు. ఉత్తరాంధ్రతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించే నైపుణ్య అర్హతలన్నీ మసిలామణికి ఉన్నాయని భావించిన ఇపిడిసిఎల్ ఉన్నతమైన ఈ పదవిలో నియమించింది. ఆ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంతో పాటు వినియోగదారులకు అవసరమైన కోర్కెలను నెరవేర్చే దిశగా పని చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన మసిలామణికి విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్, సాంకేతిక నిపుణుల కమిటీ ప్రతినిధులు, వివిధ జిల్లాల రాజకీయ నేతలు, నాన్ టెక్నికల్ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ప్రజాశక్తి-చీపురుపల్లి

విప్లవ వీరుడు భగత్ సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యుటిఎఫ్ నాయకులు నడిపేన బలరాం అన్నారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరిం చుకొని స్థానిక వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో అఖిలభారత విద్యార్థి యువజన సంఘాలైన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎస్ ప్రసాద్‌రావు, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: భగత్‌సింగ్ జయంతి వేడుకలు సిపిఐ నాయకులు మొయిద పాపారావు ఆధ్వర్యంలో శనివారం కొండగుంపాంలో నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసే ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పోలిపల్లి సూరి నాయుడు, ఆదినారాయణ, బండి సత్యనారాయణ, రమణమ్మ, లెంక రాజారావు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - వంగర

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్ధవంతంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. అక్టోబర్ 1న రాజాంలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రదర్శన, లేబర్ ఆఫీసు వద్ద జరుగు ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని అరసాడ, నీలయ్యవలస, సంగాం, మగ్గూరు, ఎం సీతారాంపురం తదితర గ్రామాలలో శనివారం ఆటో ప్రచారం చేశారు. ఇందులో భాగంగా భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తున్న చోటకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న క్లయములను వెంటనే పరిష్కరించాలని, రిజిస్ట్రేషన్లు, రెన్యువల్ చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, డిమాండ్ చేశారు. అత్త సొమ్ము అల్లుడు ధారపోసినట్లుగా గత ప్రభుత్వం రూ.450 కోట్లు నిర్మాణ రంగకార్మికుల తాలూక డబ్బులను దారి మళ్లించిందని విమర్శించారు. ప్రస్తుతం ఉచిత ఇసుక లేక కార్మికులకు పనులు లేక ఇబ్బందులు


కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

పడుతున్నారని తక్షణం ఉచిత ఇసుకను సమర్ధవంతంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఐలాడా జగన్మోహన్, భవననిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు ఆదినారాయణ, గౌరునాయుడు, రామారావు శ్రీనివాసరావు పాల్గొన్నారు.